

'నామట్టి నాదేశం'తో..

ఢిల్లీలో స్మారక స్థూపం ఏర్పాటుకు దేశంలోని ప్రతీ ఇంటి నుంచి పిడికెడు మట్టి సేకరిస్తున్నట్లు విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. 8లో▸



దొంగల హల్‌చల్

ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనానికి పాల్పడిన దుండగులు బంగారం, నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. 8లో▸



ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జాక్టో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

మైసిగండి మైసమ్మతల్లికి ఎమ్మెల్సీ పూజలు



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీకి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సంజీవ్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వెంకటమ్మ, నాయకులు చందోజీ, నరేశ్‌నాయక్, యాదగిరి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జహంగీర్‌అలీ, భూనాథ్, బిక్కు నాయక్, ప్రభులింగం, సురేందర్‌రెడ్డి, సుమన్‌గౌడ్ ఆలయ అర్చక సిబ్బంది ఉన్నారు.

'టాస్' ప్రవేశాలకు గడువు పెంపు

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్)లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువును ఈ నెల 21వరకు పెంచినట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల విద్యకు దూరమైన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు, ఆశ వర్కర్లు, 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయి చదువుకునే ఆసక్తి ఉన్న వారికి ఇది చక్కటి అవకాశమన్నారు. పదవ తరగతి ప్రవేశం కోసం ఏదైనా స్కూల్ ధ్రువీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌లో ప్రవేశం కోసం పదవ తరగతి పాస్, ఫెయిల్ సర్టిఫికెట్‌తో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపులలో ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియంలలో అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు. వివరాలకు 9912290688, 9966553924 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జైపాల్‌యాదవ్‌కు టికెట్ ఇవ్వొద్దు

మంత్రి హరీశ్‌రావును కలిసిన అసమ్మతి నేతలు



మంత్రి హరీశ్‌రావుతో కల్వకుర్తి బీఆర్‌ఎస్ నేతలు

ఆమనగల్లు: ఎమ్మెల్యే టికెట్ల ప్రకటనతో బీఆర్‌ఎస్‌లో అసమ్మతి సెగ రాజుకుంది. కల్వకుర్తి టికెట్‌ను జైపాల్‌యాదవ్‌కు ఇవ్వడంపై పునరాలోచించాలని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పలువురు నాయకులు శుక్రవారం మంత్రి హరీశ్‌రావును కోరారు. ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, నియోజకవర్గంలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉందని స్థానిక నేతలు ఫిర్యాదు చేశారు. అందరితో మాట్లాడుతానని మంత్రి సూచించినట్లు తెలిసింది. మంత్రిని కలిసిన వారిలో నాయకులు మోత్యానాయక్, వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు తదితరులు ఉన్నారు.

సత్వర న్యాయం అందించాలి

రాచకొండ సీపీ డీఎస్.చౌహాన్



మహేశ్వరం పీఎస్‌లో రాచకొండ సీపీ డీఎస్.చౌహాన్, డీసీపీ శ్రీనివాస్ తదితరులు

మహేశ్వరం: పోలీస్ స్టేషన్‌కు వచ్చే పిటిషనర్ల వివాదాలు పరిష్కరించడంతో పాటు వారికి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని రాచకొండ సీపీ డీఎస్.చౌహాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని పీఎస్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే వారితో పోలీసులు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. అనంతరం సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. ఆయన వెంట మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, సీఐ ముని, ఎస్ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

ఏకగ్రీవం.. ఏదీ సాయం!

ఏకగ్రీవ పంచాయతీలకు రూ.15లక్షల నిధులు ప్రోత్సాహకంగా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం ప్రజలు, ప్రజాప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి గ్రామాలను యునానిమస్ చేసుకున్నారు. కానీ ఏళ్లు గడుస్తున్నా నేటికీ నిధులు రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో 135 పంచాయతీలకు అందని ప్రోత్సాహకం
- అప్పుల్లో సర్పంచులు.. ఆందోళనలో కుటుంబ సభ్యులు
- పట్టించుకోని ప్రభుత్వం



ఏకగ్రీవంగా ఎన్నికైన కడ్తాల్ మండలం పెద్దవేములోని బావితండా పంచాయతీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మొండి చేయి చూపింది. ఎన్నికల ముందు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు ప్రకటించి.. ఆ తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించింది. ఫలితంగా అప్పులు చేసి సర్పంచ్‌గా ఎన్నికైన అభ్యర్థులకు ఆ తర్వాత ఇబ్బందులు తప్పడం లేదు. పాలకమండళ్లు ఏర్పడి నాలుగేళ్లు కావొస్తున్నా.. ఇప్పటికీ నగదు ప్రోత్సాహకం అందకపోవడం, ఎన్నికల కోసం చేసిన అప్పులు ఇప్పటికీ తీరక పోవడంతో ఆయా గ్రామాల సర్పంచుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయే పరిస్థితి తలెత్తింది.

ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించక

ప్రభుత్వం జిల్లాలోని గ్రామ పంచాయతీలకు 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించింది. ఫిబ్రవరి 2న పాలకవర్గం ఏర్పాటు చేసింది. ఏకగ్రీవంగా ఎన్నికైన చిన్న పంచాయతీలకు రూ.10 లక్షలు.. పెద్ద పంచాయతీలకు రూ.15 లక్షల చొప్పున ప్రోత్సాహక బహుమతిగా అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని భావించిన సర్పంచ్‌లకు నిరాశే మిగిలింది. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో జీపీల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, మురుగు కాల్వల పూడిక తీత, తాగునీటి సరఫరా, ట్రాక్టర్లకు వాయిదాలు, డీజిల్ కొనుగోలు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఇతర అభివృద్ధి పనులు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,187 పంచాయతీలు ఉండగా, వీటిలో 135 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటికి ఇప్పటి వరకు ముందస్తు ప్రకటించిన ప్రోత్సాహకంతో పాటు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేక పోతున్నాయి. ఎన్నికల కోసం ఇప్పటికే భారీగా అప్పులు చేసిన సర్పంచ్‌లు.. అభివృద్ధి పనులకు కూడా యాచించాల్సిన పరిస్థితి తలెత్తింది.

జిల్లా	మొత్తం జీపీలు	ఏకగ్రీవం
రంగారెడ్డి	560	53
వికారాబాద్	566	75
మేడ్చల్	61	07

- చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ మండలం తిర్మలాపూర్, లక్ష్మారావుగూడ, పోలారం, బొబ్బిలిగామ, గొల్లూరుగూడ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి పైసా ప్రోత్సాహకం అందలేదు.
- ఆమనగల్లు నియోజకవర్గంలోని కొత్తకుంటతండా, మాడ్గుల మండలం పలుకుతండా, కాశగూడెం, గుడితండా, తలకొండపల్లి మండలం పడమటి తండా, బలుసులపల్లి తండా, కోరింతకుంట తండా, హర్యానాయక్ తండా, వెల్జాల్ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. కడ్తాల్ మండల పరిధిలో పల్లెచెలక, గానుగమార్ల తండా, బాలాజీ నగర్, పెద్ద వేములబావి తండా, నార్లకుంట తండాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని మంచాల మండలం సత్తితండా, యాచారం మండలం నందివనపర్తి, కేశితండా గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.
- షాద్‌నగర్ నియోజకవర్గం కన్హశాంతివనం, బండోనిగూడ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటిలో ఏ ఒక్క గ్రామ పంచాయతీకి ఇప్పటి వరకు నయా పైసా అందలేదు.

ఇప్పటికీ పైసా రాలేదు



ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షలు ఇస్తామన్నారు.ఇప్పటికీ పైసా ఇవ్వలేదు. అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నాం.ఆయా పనులకు సంబంధించిన బిల్లులు సైతం రాలేదు. ప్రభుత్వానికి అనేక మార్లు విజ్ఞప్తి చేశాం. కానీ కనీస స్పందన కూడా లేదు.

– శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, తిర్మలాపూర్

అడిగినా ఇవ్వలేదు



నందివనపర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. ఎన్నికల ముందు నగదు ప్రోత్సాహకం ఇస్తామని చెప్పారు. ఇప్పటికీ ఇవ్వలేదు. పలు మార్లు జిల్లా పంచాయతీ అధికారిని అడిగాం. అయినా ఫలితం లేదు.

– కంబాలపల్లి ఉదయశ్రీ, సర్పంచ్, నందివనపర్తి



పార్కును ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్దపీట

- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రగతి పథకంలో రూ.45లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, పార్కును చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు అశోక్‌కుమార్, శ్వేత, చంద్రమౌళి, అశోక్, కో–ఆప్షన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, రజిని, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, బాలకృష్ణ, రాంరెడ్డి, వీరారెడ్డి, రవీందర్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసేందుకు కుట్ర

- కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముగాస్తున్న ఎమ్మెల్యే
- బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



భూ బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మంచాల: కొంతమంది అధికార పార్టీ నాయకులు రియల్ వ్యాపారులుగా మారి రైతులను మోసం చేసేందుకు కుట్రపన్నుతున్నారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని బండలేమూర్ గ్రామంలో లోయపల్లి, బండలేమూర్, ఆంబోత్ తండా, సత్తి తండా గ్రామాల భూ బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కంపెనీల పేరిట భూములు కొనుగోలు చేసి సత్యం రామలింగరాజుకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులంతా ఏకతాటిపై ఉండి భూముల్లోకి రాకుండా అడ్డుకోవాలని సూచించారు. అన్యాయానికి గురవుతున్న రైతుల పక్షాన ఉండాల్సిన అధికార పార్టీ ఎమ్మెల్యే కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముగాస్తున్నారని ఆరోపించారు. రైతుల భూములు లాక్కొని అక్రమంగా మైనింగ్ చేపడుతున్నారని విమర్శించారు. 70ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. రైతులకు న్యాయం చేసే వరకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పాందాల జంగయ్యగౌడ్, కొండల్, రాంచంద్రయ్య, రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజారంజక పాలన



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్‌తోనే ప్రజారంజక పాలన సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, పీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకులు అమరేందర్‌రెడ్డి, మల్లేశ్, కొత్త మనోహర్‌రెడ్డి, అందుగుల సత్యనారాయణ, జి.ప్రభాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, పార్టీ జిల్లా మైనార్టీ ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు మహేశ్, రేవంత్, గణేశ్, జంగయ్య, శ్రీనివాస్‌గౌడ్, జగన్‌గౌడ్, మల్లేశ్, జగన్, వెంకటేశ్‌గౌడ్, శేఖర్, రజనీకాంత్, ఖాజామోయినుద్దీన్, సత్యం, బాబు, ప్రవీణ్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లకురుమ మహాసభకు రండి

- కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: గొల్ల కురుమల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కురుమ సంఘం రాష్ట్ర నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశ్ సంఘం నాయకులు బెంగుళూరులోని సీఎం నివాసంలో మాజీ మంత్రి హెచ్‌ఎం రెవన్న, ఎమ్మెల్సీ విశ్వనాథంతో కలిసి సీఎంకు ఆహ్వానపత్రిక అందజేశారు. అక్టోబర్ 9న భువనగిరి పార్లమెంట్ పరిధిలో నిర్వహించే ఈ సభకు తప్పక హాజరవ్వాలని కోరారు. సీఎం సిద్ధరామయ్యను కలిసిన వారిలో కొత్తకుర్మ శివకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగ వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు జంగయ్య, రాజు తదితరులున్నారు.



కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎగ్గే మల్లేశం, క్యామ మల్లేశ్

పేదలకు 75 గజాల ఇంటి స్థలం

- 220 మందికి పట్టాలు పంపిణీ చేసిన మంత్రి సబితారెడ్డి
- ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు శంకుస్థాపన



ఘట్టుపల్లిలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: గ్రామాల్లో ప్రభుత్వ స్థలం ఉంటే ఇళ్లు లేని పేదలకు 75 గజాల ఇంటి స్థలంలో పాటు పట్టా పత్రాలు పంపిణీ చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని ఘట్టుపల్లిలో 6.5 ఎకరాలు, మన్సాన్‌పల్లిలో ఐదెకరాల ప్రభుత్వ స్థలంలో పేదలకు 75 గజాల స్థలం కేటాయించి పట్టా పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలం ఉన్న గ్రామాల్లో పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఘట్టుపల్లిలో 6.20 ఎకరాల భూమిలో 220 మందికి పట్టాలు పంపిణీ చేశామన్నారు. అర్హత ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. మండల పరిధిలోని సిరిగిరిపురం, మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి, గొల్లూరులో ప్రభుత్వ స్థలాలు గుర్తించి ఇంటి స్థలాలకు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీతానాయక్, ఘట్టుపల్లి, మన్సాన్‌పల్లి సర్పంచ్‌లు కె.అనితారెడ్డి, కంది అరుణ, ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్, నర్సింహ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పాండుయాదవ్, వెంకటేశ్వరరెడ్డి, వీరాంజనేయ స్వామి ఆలయ ట్రస్టీ మెంబర్ కె.ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లేశ్ యాదవ్, సాదయ్య, రాకేశ్‌రెడ్డి, జాన్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండి.సాదత్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదు భవనాలకు రూ.50లక్షలు

కుల సంఘాలకు సంక్షేమానికి ప్రభుత్వం ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తోందని మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మన్సాన్‌పల్లిలో నాయీ బ్రాహ్మణ(మంగలి), శాలివాహ(కుమ్మరి), వడ్డెర, విశ్వబ్రాహ్మణ, రజక(చాకలి) కుల సంఘాలకు ఒక్కో సంఘానికి 400గజాల చొప్పున స్థలం కేటాయించారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.10లక్షల చొప్పున కేటాయించారు. ఈ పనులను ఆమె జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో అన్ని కులాల వారు తలెత్తుకునేలా కుల సంఘం భవనాల నిర్మాణం చేపడతామన్నారు. ఈ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.14 కోట్లు కేటాయించామని.. భవిష్యత్‌లో మరిన్ని సంఘాలకు నిధులు విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా కుల సంఘాల నేతలు మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్‌లను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింహయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి, రైతు బంధు మండల కమిటీ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు థామస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరిగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ గైర్హాజరు

ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి తన సొంత గ్రామంలో చేపట్టిన ఇళ్ల పట్టాల పంపిణీ, ఆలయ ప్రాంగణంలో హాలు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. కొంత కాలంగా ఆయన మంత్రి చేపట్టే కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

సెల్లార్‌లో మంటలు

- కాలిబూడిదైన 9 ద్విచక్ర వాహనాలు
- పాక్షికంగా దగ్ధమైన కారు



రాజేంద్రనగర్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిమిషాల వ్యవధిలోనే ద్విచక్ర వాహనాలకు మంటలు వ్యాపించి కాలిబూడిదైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి గ్రీన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రీన్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వారు తమ వాహనాలను, కార్లను సెల్లార్‌లో పార్కు చేశారు. గురువారం రాఖీ పౌర్ణమి కావడంతో వాచ్‌మన్ తన భార్యతో కలిసి సొంతూరు వెళ్లాడు. గురువారం రాత్రి ఆరు బైక్‌లు, మూడు యాక్టివా వాహనాలు, ఒక కారును అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వారు పార్కు చేసి నిద్రకు ఉపక్రమించారు. శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో సెల్లార్ నుంచి మంటలు, పొగలు వస్తుండడంతో స్థానికులు అపార్ట్‌మెంట్ వాసులను అప్రమత్తం చేశారు. కిందకు వచ్చేసరికి దట్టమైన పొగ, మంటలు వ్యాపించడంతో విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులు, అత్తాపూర్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అత్తాపూర్ ఫైర్ ఆఫీసర్ చంద్రానాయక్ ఆధ్వర్యంలో హుటాహుటిన చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే ఆరు బైక్‌లు, మూడు యాక్టివా వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక కారు పాక్షికంగా దగ్ధమైంది. పార్కు చేసిన రెండు కార్లతో పాటు మరో బైక్‌ను స్థానికులు బయటకు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

‘నామట్టి నాదేశం’తో దేశభక్తి

దేశం కోసం ప్రాణాలర్పించిన వారికి ఢిల్లీలో స్మారక స్థూపం

- ప్రతి ఇంటి నుంచి పిడికెడు మట్టి సేకరించాలని ప్రధాని పిలుపు
- ధర్మసాగర్‌లో ప్రారంభించిన మాజీ ఎంపీ కొండా

చేవెళ్ల: దేశంకోసం ప్రాణాలు అర్పించిన అమరుల కోసం ఢిల్లీలో స్మారక స్థూపం ఏర్పాటు చేసేందుకు గాను దేశంలోని ప్రతి ఇంటినుంచి పిడికెడు మట్టి సేకరణ అనే కార్యక్రమానికి నరేంద్రమోడీ శ్రీకారం చుట్టారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ‘ప్రతి గ్రామంలో మేరా మట్టి మేరా దేశ్(నా మట్టి నాదేశం)’ అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేవెళ్ల మండలంలోని తనసొంత గ్రామం ధర్మసాగర్‌లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.



ధర్మసాగర్‌లో మట్టి సేకరిస్తున్న కొండా, బీజేపీ నాయకులు

అందరూ భాగస్వాములు కావాలి..

దేశంలోని ప్రతి ఒక్కరికి దేశం మీద ప్రేమ, భక్తి, గౌరవం ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కన్వీనర్‌గా తనను ఎంపిక చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్, నియోజకవర్గ నాయకులు తులసీరామ్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జాతీయ మాజీ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్సీ మోర్చా జ్ఞానేశ్వర్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, మొయినాబాద్ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రం(ఫిజిక్స్) పోస్టులో విద్యాబోధన చేసేందుకు గాను అర్హులైన వారు ఈనెల 4వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్ ఉత్తీర్ణత.. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కళాశాలలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చందన్ కుమార్(19) తుక్కుగూడలోని మహ్మద్ ఇబ్రహీంకు సంబంధించిన కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అయితే గురువారం రాత్రి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు మంఖాల్ వద్ద తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న చందన్‌ను చూసిన కార్మికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అతడిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై.. ఆత్మహత్య

పహాడీషరీఫ్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు.. జల్‌పల్లి శ్రీరాంకాలనీకి చెందిన కుషాల్ బాయి,సంతోష్(48) దంపతులు. కొంతకాలంగా సంతోష్ తాగుడుకు బానిసయ్యాడు. వారం రోజు ల నుంచి మద్యానికి డబ్బు లు అడుగుతుండటంతో కుటుంబ స భ్యులు మందలించారు. గురువా రం రాఖీ పండుగ ఉండటంతో కుటుంబ సభ్యులు బయటికి వెళ్లా రు. రాత్రి వచ్చి చూ డగా సంతోష్ బెడ్ రూంలో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉన్నా డు.పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లైన్‌మెన్ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: గుండెపోటుతో ఓ విద్యుత్ లైన్‌మెన్ మృతి చెందాడు. ఆదిబట్ల సీఐ రఘువీర్ రెడ్డి కథనం ప్రకారం.. యాచారం గ్రామానికి చెందిన కృష్ణ (55) తుర్కయంజాల్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి ఛాతినొప్పి రావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి యశోదా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కృష్ణ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పులబాధ భరించలేక..

పురుగులమందు తాగి ఆత్మహత్య

తలకొండపల్లి: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెల్జాల్‌లో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య చెప్పిన వివరాల ప్రకారం... తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన జంగయ్య (48) ఇటీవల ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జంగయ్య శుక్రవారం మృతిచెందాడు. అప్పుల బాధ భరించలేకనే జంగయ్య ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం

- విషంతాగి అపస్మారక స్థితిలో గుర్తింపు
- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

ఆమనగల్లు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ ప్రాణాలను ఆమనగల్లు పోలీసులు కాపాడారు. చికిత్స అనంతరం మహిళను కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాలు.. హైదరాబాద్‌లోని లాలాగుడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే మంగమ్మ.. కుమార్తె, కుమారుడితో సహా శుక్రవారం ఉదయం ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో అదేరోజు సాయంత్రం లాలాగుడ పోలీసులకు భర్త రాములు ఫిర్యాదు చేశాడు. ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి సమీపంలో మంగమ్మ సెల్‌ఫోన్ లోకేషన్‌ను పోలీసులు గుర్తించారు. వెంటనే ఆమనగల్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం.. అక్కడికి వెళ్లి మంగమ్మ, ఇద్దరు పిల్లలను గుర్తించారు. అయితే అప్పటికే మంగమ్మ విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. చికిత్స అనంతరం మంగమ్మతో పాటు పిల్లలను కుటుంబసభ్యులకు అప్పగించారు.

బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టండి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్‌రావు, ఆంజనేయులు, దేవేందర్‌గౌడ్, భద్రునాయక్, శివ, శంకరయ్య తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో ఉన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, యాదవ్, విశ్వం, లక్ష్మణ్‌నాయక్, ఆశన్నగౌడ్, బాలునాయక్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

బృందావన్ కాలనీలో దొంగల హల్‌చల్

- ఒకేరోజు మూడు ఇళ్లలో చోరీ
- రెండున్నర తులాల బంగారం, రూ.25వేలు ఎత్తుకెళ్లిన దుండగులు

షాద్‌నగర్‌రూరల్: ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనానికి పాల్పడిన దుండగులు రెండున్నర తులాల బంగారం, రూ.25వేలు, ఒక సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఘటన పట్టణంలోని బృందావన్‌కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ నయిాముద్దీన్ కథనం ప్రకారం.. పట్టణంలోని బృందావన్ కాలనీలో నివాసం ఉంటున్న మల్లికార్జున్‌నాయక్ ఇంటికి రక్షాబంధన్ రోజున(గురువారం) బంధువులు వచ్చారు. ఈ క్రమంలో అదేరోజు రాత్రి బంధువులందరు కింద ఫ్లోర్‌లో నిద్రించారు. పై అంతస్తులో ఎవరూ లేకపోవడంతో.. గమనించిన దుండగులు పైఫ్లోర్‌లోని ఇంటితలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని రెండున్నర తులాల బంగారం, ఒక సెల్‌ఫోన్‌ను దోచుకెళ్లారు. అదే కాలనీలో నివాసం ఉంటున్న రాకేష్‌కుమార్‌గౌడ్ రక్షాబంధన్ పండుగకు కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఇంటి తాళాలను పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ. 25వేలను ఎత్తుకెళ్లారు. మరో ఘటనలో మహబూబ్‌నగర్ రోడ్డులోని ఏబీ కాంప్లెక్స్ వెనుకభాగంలో నివాసం ఉంటున్న వెంకటేష్ కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి అతడి ఇంట్లోనూ చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐలు శరత్‌కుమార్, నయిామోద్దీన్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీంతో వివరాలను సేకరించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.



చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ శరత్‌కుమార్

నిందితులను కఠినంగా శిక్షిస్తాం

ఇన్‌స్పెక్టర్ సురేశ్

నందిగామ: శివలింగాన్ని ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని ఇన్‌స్పెక్టర్ సురేష్ అన్నారు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నర్సప్పగూడ గ్రామపెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. శివలింగం నెలరోజుల క్రితమే ధ్వంసమైనట్లు తమ విచారణలో తేలిందని తెలిపారు. భక్తులను విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. పగిలిపోయిన శివలింగాన్నే పూజిస్తున్నట్లు భక్తుల ద్వారా తెలిసిందన్నారు. ఇప్పటికే క్లూస్‌టీం ద్వారా వివరాలు సేకరించామని.. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాలకృష్ణ, జెడ్పీ వైస్‌చైర్మన్ గణేశ్, సర్పంచ్ అశోక్, నాయకులు యాదగిరి, లక్ష్మణ్‌గౌడ్, అరవింద్, అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సురేశ్

ఇనాంగూడ బస్టాప్‌లో గుర్తుతెలియని మృతదేహం



అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని ఇనాంగూడ బస్టాప్‌లో శుక్రవారం ఉదయం ఓ గుర్తుతెలియని మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లిన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 35–40 సంవత్సరాల మధ్య ఉంటుందని, బూడిద రంగు షర్ట్, ఆరెంజ్ కలర్ గీతల టవల్‌ను ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకీ తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారు అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

మంత్రిని కలిసిన గోలి

తలకొండపల్లి: రాష్ట్ర మంత్రి టీ.హరీష్‌రావును రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం కలిసి సన్మానించారు. రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గోలి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ నాగులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సభాష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీష్‌రావుతో గోళి శ్రీనివాసురెడ్డి

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల నిరసన

ఇబ్రహీంపట్నం రూరల్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జాక్టో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీ వేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జాక్టో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్, చంద్రశేఖర్, గోపాల్, పాండు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో...

పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. బదిలీలు, ప్రమోషన్లలో జిల్లాలోని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పరస్పర బదిలీలకు ఆమోదం తెలపాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, గౌరవ అధ్యక్షుడు నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, నర్సింహగౌడ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.